సాక్షి మంచిర్యాల

సోమవారం । 2 । జూన్ । 2025



మత్తు వదలరా..!

జిల్లాలో గంజాయి దందాపై పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు చేపడుతున్నా చీకటి వ్యాపారం ఆగడం లేదు. గంజాయి మత్తుకు యువత బానిసవుతోంది. 8లో▸



పక్కా భవనాలు లేక పరేషాన్

ప్రజలవద్దకే పాలన నినాదంతో కొత్త పంచాయతీలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం పంచయతీ భవనాలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.3 /28.4

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

విత్తనం.. ఇక రైతుదే పెత్తనం

వరి, సోయా, జొన్న, మొక్కజొన్న, కంది.. ఇలా ఏ విత్తనం కావాలన్నా రైతులు విత్తన కంపెనీలపై ఆధార పడాల్సిందే. ఇక విత్తన ధరలు ఏటా పెరుగుతూనే ఉన్నాయి. రైతుల పెట్టుబడిని పెంచుతున్నాయి. ఎక్కువ ధర పెట్టి కొన్న విత్తనాలు నాణ్యమైనవన్న గ్యారంటీ ఉండదు. ఈ పరిస్థితుల నుంచి రైతులకు విముక్తి కల్పించేందుకు, కాస్త ఉపశమనం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. 'నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం' పేరిట ప్రతీ గ్రామంలో ఎంపిక చేసిన రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తారు. వచ్చే ఏడాది నుంచి ఈ రైతుల పండించిన విత్తనాలే గ్రామంలో విక్రయిస్తారు. దీంతో విత్తనంపై రైతులే పెత్తనం చేస్తారు. డీలర్ల మాయాజాలానికి చెక్ పడుతుంది.



కోట శివకృష్ణ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్

- వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం..
- నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం
- ప్రతీ గ్రామంలో ఎంపిక చేసిన రైతులకు పంపిణీ
- నేడు ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

బెల్లంపల్లి: వర్షాకాలం ప్రారంభమైంది. రైతులు సాగు పనులు ప్రారంభించారు. ఈసారి రుతుపవనాలు ముందుగానే రావడంతో వర్షాలు కూడా కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త కోట శివకృష్ణ కార్యక్రమ వివరాలు వెల్లడించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మేలైన విత్తనాలను పంపిణీ చేయడం ద్వారా విత్తనోత్పత్తి నిప్రోత్సహించి, ఇతర రైతులకు కూడా విత్తనాలు అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్ర మం ఉద్దేశం, పంపిణీ విధానం, రైతులకు కలిగే ప్ర యోజనాలను 'సాక్షి'కి వివరించారు.

గ్రామ గ్రామానికీ పంపిణీ..

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా పంటల సాగులో నాణ్యమైన విత్తనాల ప్రాధాన్యతను గుర్తించి 'నాణ్యమైన విత్తనం – రైతన్నకు నేస్తం' పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనాలు అభ్యుదయ రైతులకు అందజేస్తారు. ఎంపిక చేసిన రైతులకే విత్తనాలు పంపిణీ చేస్తారు.

నేటి నుంచి ప్రారంభం..

రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ గ్రామాల్లో వ్యవసాయ పరిశోధన కేంద్రాల ద్వారా ఉత్పత్తి చేసిన నాణ్యమైన విత్తనాలను సోమవారం(జూన్ 2) నుంచి అందిస్తారు. ఈ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారు. ప్రతీ రెవెన్యూ గ్రామంలో ఎంపిక చేసిన 3 నుంచి 5 మంది రైతులకు విత్తనాలు అందచేస్తారు.

సహచర రైతులకు అమ్మకాలు

ఎంపిక చేసిన రైతులు నాణ్యమైన విత్తనాలతోసాగు చేసి, తదుపరి పంట ద్వారా ఉత్పత్తి చేసిన విత్తనాలను సహచర రైతులకు తక్కువ ధరకు అందించనున్నారు. విత్తనోత్పత్తిపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తారు. ఈ విధానం ద్వారా, రానున్న రెండు–మూడేళ్లలో ప్రతీగ్రామం విత్తన స్వయం సమృద్ధిని సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు.

విత్తన భద్రతలో ఆదర్శం

తెలంగాణ రాష్ట్రం విత్తన భద్రతలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ఈ కార్యక్రమం చేపడుతుంది. అభ్యుదయ రైతులు ఈ ఉద్దేశాన్ని గుర్తించి, సహకారం అందించాలని కేవీకే శాస్త్రవేత్తలు కోరుతున్నారు. ఈ కార్యక్రమం రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడమే కాక, వ్యవసాయంలో స్వయం సమృద్ధిని సాధించే దిశగా ఒక ముందడుగని తెలిపారు.

బెట్టింగ్ ఉచ్చులో యువత

- ఈజీ మనీపై ఆశతో తప్పటడుగు
- మొదట వేలల్లో పెట్టి.. లక్షల్లో అప్పుల పాలు
- ఆన్‌లైన్ మోసాలబారిన పడుతున్న యువత



జైపూర్: ప్రస్తుత తరంలో యువత బెట్టింగ్‌లకు ఆకర్షితులై, చిన్న వయసులోనే చిత్తవుతున్నారు. పట్టణాల నుంచి పల్లెల వరకూ బెట్టింగ్ ఒక జూదంలా మారింది. రకరకాల బెట్టింగ్ యాప్‌లు, ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన యువత హద్దులు దాటి అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. మొదట స్నేహితుల వద్ద వేల రూపాయల్లో అప్పులు చేస్తూ బెట్టింగ్‌లు ఆడుతూ, తర్వాత ఆ అప్పులు తీర్చేందుకు మరింత వడ్డీకి డబ్బులు తెచ్చి, లక్షల్లో మోసాలకు గురవుతున్నారు. తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించాలనే కోరిక కొందరిదైతే, జల్సాలకు అలవాటు పడిన యువత బెట్టింగ్‌ను ఒక ట్రెండ్‌గా భావిస్తూ ఆడుతున్నారు.

తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు..

తల్లిదండ్రులు తమ కుమారులను పెద్ద పట్టణాల్లో డిగ్రీలు, బీటెక్‌లు చదివించి, ఉన్నత భవిష్యత్తును ఆశిస్తుంటే, వారు చేసిన లక్షల రూపాయల అప్పులు తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొందరు యువకులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతుండగా, మరికొందరి తల్లిదండ్రులు తమ కుమారుల అప్పులను తీర్చేందుకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లాలో జరిగిన కొన్ని ఘటనలు..

- జైపూర్ మండలం, రామారావుపేటకు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీ స్థాపించి, 5 శాతం కంటే ఎక్కువ వడ్డీ చెల్లిస్తానని చెప్పి, బంధువులు, స్నేహితుల నుంచి లక్షల రూపాయలు సేకరించాడు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడతానని చెబుతూ, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50 కోట్ల రూపాయలు వసూలు చేశాడు. ఆరు నెలల క్రితం ఐపీ పెట్టి పరారై, ఎక్కువ వడ్డీకి ఆశపడిన వారిని మోసం చేశాడు.
- జైపూర్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు కరీంనగర్‌లో బీటెక్ చదువుతున్నాడు. బెట్టింగ్‌ల కోసం స్నేహితుల వద్ద సుమారు రూ.10 లక్షలు అప్పు చేశాడు. ఇటీవల ఈ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో వారు ఆందోళనకు గురయ్యారు. చదువుకోసం వెళ్లిన ఈ యువకుడు బెట్టింగ్‌లలో మునిగి, అప్పు ఇచ్చినవారు ఇంటికి రావడం స్థానికంగా ఈ విషయం చర్చనీయాంశమైంది.
- జైపూర్ మండలం, గంగిపల్లికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ యాప్‌లలో సుమారు రూ.15 లక్షలు పోగొట్టి, తల్లిదండ్రులకు చెప్పలేక, ఏడాది క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- జిల్లాలో పలువురు డీడబ్ల్యూ, మైవిత్రి వంటి యాప్‌లలో లక్షల రూపాయలు పెట్టి మోసపోయారు. మొదట జాయిన్ అయినవారికి కొంత డబ్బు వచ్చినందున, వారు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులను చేర్పించారు. కానీ, కొంత కాలం తర్వాత ఆ యాప్‌లు మూతపడడంతో, అప్పులు తెచ్చి డబ్బులు పెట్టినవారంతా నష్టపోయారు.

తల్లిదండ్రులు గమనిస్తుండాలి..



తల్లిదండ్రులు ఎప్పుడూ వారి పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలి. సెల్‌ఫోన్లు అవసరం మేరకే వినియోగించేలా చూడాలి. బెట్టింగ్ యాప్స్‌లో మొదట కొన్ని డబ్బులు పెడుతూ వచ్చి అదే అలవాటుగా మారి అప్పులు చేసి మోసపోతున్నారు. ఎవరూ ఊరికే డబ్బులు ఇవ్వరు. ఈజీ మనీకి అలవాటుపడి మోసపోతున్నవారే చివరికి అప్పులపాలవుతున్నారు.

– ఎ.వెంకటేశ్వర్(ఏసీపీ, జైపూర్)

ఈవీల జోరు..



మంచిర్యాలలో ఈవీ వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐలు(ఫైల్)

- జిల్లాలో పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు
- నిబంధనలు తెలుసుకోవాలంటున్న రవాణా అధికారులు..
- లేదంటే వాహనం సీజ్ అయ్యే అవకాశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పెట్రోల్ ధరల పెరుగుదల, ఈ–చలాన్‌ల భారం నుంచి ఉపశమనం కోసం జనం ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) వైపు మొగ్గుతున్నారు. దీంతో జిల్లాలో ఈవీ వాహనాల కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. 2014 నుంచి ఇప్పటివరకు జిల్లా రహదారులపై 8,430 ఈవీ వాహనాలు తిరుగుతున్నాయి. ఏటా రిజిస్ట్రేషన్ సంఖ్య చూస్తే, రానున్న రోజుల్లో ఈవీల సంఖ్య మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేకుండా, పెట్రోల్ ఖర్చు, ఈ–చలాన్‌ల ఇబ్బందులు లేకుండా ఈవీ వాహనదారులు సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారు. అయితే, వేగ నిబంధనలు పాటించని ఈవీ వాహనాలను సీజ్ చేస్తామని రవాణా అధికారులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక సౌలభ్యం కోసం ఈవీ వాహనాలను ఎంచుకుంటున్నవారు వేగ నిబంధనలు, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, లైసెన్స్ వంటి రవాణా నిబంధనలను పాటించాలి. అవగాహనతో కొనుగోలు చేస్తే, ఈవీ వాహనాలు సౌకర్యవంతమైన, పర్యావరణ హితమైన ప్రయాణాన్ని అందిస్తాయి.

వేగ నిబంధనలు..

ఎలక్ట్రిక్ వాహనాలు గంటకు 25 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వెళ్తే రవాణా శాఖ(ఆర్‌టీఏ) రిజిస్ట్రేషన్ పరిధిలోకి వస్తాయి. ఈ వాహనాలకు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ తప్పనిసరి. 25 కి.మీ. కంటే తక్కువ వేగంతో నడిచే వాహనాలను సైకిల్‌తో సమానంగా పరిగణిస్తారు. వీటికి ఆంక్షలు వర్తించవు. అయితే, వేగ నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్ చేస్తారు. గతంలో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో 25 కి.మీ.కు మించి వేగంతో నడిచే ఈవీ వాహనాలకు జరిమానాలు విధించారు. పదుల సంఖ్యలో వాహనాలను సీజ్ చేశారు.

సర్టిఫికేషన్ నిబంధనలు..

ఈవీ వాహనాల ధ్రువీకరణ కోసం భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో రెండు సంస్థలు ఏఆర్ఆర్ఐ(ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, పూణే), ఐకాట్(ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ, మానేసర్) టైప్ అప్రూవల్ సర్టిఫికెట్‌లు జారీ చేస్తున్నాయి. రిజిస్ట్రేషన్ పరిధిలోకి రాని వాహనాలకు సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ (సీఎంవీఆర్) (2)(యు) సర్టిఫికెట్ ఇస్తారు. అయితే, 25 కి.మీ.కు మించి వేగంతో నడిచే వాహనాలకు ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

షోరూమ్‌ల గోల..

పెట్రోల్ ఖర్చు, ఈ–చలాన్‌ల భారం, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ఆంక్షలు లేని సౌలభ్యాన్ని ఆసరాగా చేసుకుని, కొన్ని ఈవీ షోరూమ్‌లు 25 కి.మీ.కు మించి వేగంతో నడిచే వాహనాలకు కూడా సీఎంవీఆర్ (2)(యు) సర్టిఫికెట్ జారీ చేసినట్లు గత తనిఖీల్లో బయటపడింది. దీనిపై రవాణా అధికారులు కఠినంగా స్పందిస్తున్నారు.

అవగాహన ఉండాలి..



ఈవీ వాహనాలపై ప్రభుత్వాలు మినహాయింపులు, ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. దీంతో ఇటీవల ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం పెరిగింది. అయితే వాహనాలు కొనుగోలు చేసే సమయంలో వాటిపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. ఈవీ వాహనాలను అమ్మే డీలర్ల మాటలు విని మోసపోకుండా పూర్తిగా నిర్ధారణ చేసుకుని వాహనాలను కొనుగోలు చేసుకోవాలి.

– సంతోష్‌కుమార్, ఇన్‌చార్జి డీటీవో

సంవత్సరం	వాహన రిజిస్ట్రేషన్‌లు	ద్విచక్ర వాహనాలు	కార్లు	ఆటోలు	ఇతర వాహనాలు
2024	382	341	12	17	12
2025	143	105	9	14	15 (మే 26 వరకు)

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్రపాణి

జన్నారం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ బడులను కాపాడాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంపు కోసం యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచారజాత కార్యక్రమం ఆదివారం జన్నారం మండలం తిమ్మాపూర్, రాంపూర్, తపాలాపూర్, చింతగూడ, పొనకల్, జన్నారం, సూరారం గూడెం, రేండ్లగూడలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్ బుక్స్, యూనిఫాంలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. చదువుల నాణ్యతలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మధ్య పెద్దగా వ్యత్యాసం లేదని సర్వేలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ బడి మూతపడితే సమాజానికి నష్టమన్నారు. మన ఊరు – మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా మౌలిక వసతుల కల్పన మెరుగైందని తెలిపారు. గ్రామాలలో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ శ్రేణుల ఆధ్వర్యంలో జూన్ 5 వరకు ప్రచారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రచార జాతలో జిల్లా ఉపాధ్యక్షుడు వి.కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శులు కె.చంద్రమౌళి, జి.నర్సయ్య, జన్నారం, దండేపల్లి మండలాల అధ్యక్షులు బాపు, ఆర్.తులసీపతి, జన్నారం మండల ప్రధాన కార్యదర్శి యస్.నర్సయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



దండేపల్లి: లబ్ధిదారులతో ఎమ్మెల్యే పీఎస్సార్..

దండేపల్లి/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. దండేపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, రాజీవ్ యువ వికాస్ పథకంలో సబ్సిడీ రుణాల కోసం ఎంపిక చేసిన లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలు మేదరిపేటలో ఆదివారం పంపిణీ చేశారు. లక్సెట్టిపేట మున్సిపాలిటీ, మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు కూడా మంజూరు పత్రాలు అందించారు. హాజీపూర్ మండలం దొనబండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 281 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. తనను గెలిపించిన ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేవారికి ఇసుక, మొరం ఉచితంగా అందుతుందని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికే తనపై ప్రెస్‌మీట్‌లు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమాల్లో దండేపల్లి తహసీల్దార్ రోహిత్‌దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్, ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, జిల్లా ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కూమర్, పూర్ణచందర్ రావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, కాంగ్రెస్ దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల అధ్యక్ష, కార్యదర్శులు అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీశ్, పింగళి రమేశ్, లక్సెట్టిపేట పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఆరిఫ్, యూత్ అధ్యక్షులు నవీన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

'సర్దుబాటు సరికాదు'

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుతామని గతంలో చెప్పిన ప్రభుత్వం, జీవో 25ను పరిగణనలోకి తీసుకుని, 1,267 ప్రొసీడింగ్‌ను విడుదల చేస్తూ సర్దుబాటు ఉత్తర్వులను జారీ చేయడం సరికాదని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బట్టారి వెంకటేశ్వర్లు, చీపెల్లి బాపులు అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో మాట్లాడారు. అభ్యసన సామర్థ్యాలను పెంచాలని, అందుకు ఉపాధ్యాయులు బాధ్యత వహించాలని చెప్పిన అధికారులు సర్దుబాటు పేరిట, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా చేయాలని చూడడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గిపోతుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నమోదు పెంపు కోసం సమష్టిగా కృషి చేద్దామని చెప్పిన విద్యాశాఖ అధికారులు, ఏకపక్షంగా సర్దుబాటు ఉత్తర్వుల జారీ చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు అర్చన, సత్తయ్య, సుమన్ పాల్గొన్నారు.

ఎల్లారం పోచమ్మకు ఎమ్మెల్యే మొక్కులు



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే వినోద్

భీమిని: కన్నెపల్లి మండలం జన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లారం పోచమ్మను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, కన్నెపల్లి మాజీ ఎంపీపీ సృజననర్సింగరావు ఆదివారం దర్శించుకున్నారు. పూజలుచేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని కోరారు. బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, పాడిపంటలు, అష్ట ఐశ్వర్యాలతో ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావు, కన్నెపల్లి, భీమిని మండలాల పార్టీ అధ్యక్షులు రామాంజనేయులు, లక్ష్మీనారయణ, మాజీ జెడ్పీటీసీలు అల్లి మోహన్, కె.సత్యానారయణ, ఆర్.సంతోష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ హరీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం పక్కదారి

చెన్నూర్‌రూరల్: మిల్లర్ల పేరుచెప్పి.. అదనంగా తూకం వేస్తున్న రైతులు ఆ ధాన్యాన్ని మరోచోటకు తరలిస్తుండగా మండల రైతులు ఆదివారం పట్టుకున్నారు. మండలంలోని శివలింగాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్రంలో రైతుల నుంచి ధాన్య కొనుగోలు చేశారు. తేమ, తరుగు పేరిట బస్తాకు 43 కిలోల చొప్పున తూకం వేశారు. లారీలో లోడ్ చేయాల్సిన ధాన్యాన్ని స్థలం లేదని క్యాబిన్‌లో వేసి మరో చోటుకు తరలిస్తుండగా అనుమానం వచ్చిన రైతులు దారికాచి లారీని అడ్డుకున్నారు. క్యాబిన్‌లో బస్తాలు లేకపోవడంతో డ్రైవర్‌ను రైతులు నిలదీశారు. క్యాబిన్‌లో వేసిన ధాన్యం బస్తాలను ఆటోలో తీసుకు వెళ్లారని చెప్పడంతో రైతులు ఆందోళన చేశారు. 12 ధాన్యం బస్తాలను చెన్నూర్‌లోని ఓ వ్యాపారికి అమ్మినట్లు గుర్తించారు. కొంత కాలంగా నిర్వాహకులు ఈ దందా చేస్తున్నారని రైతులు ఆరోపించారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

- ముఖ్య అతిథిగా హర్కర వేణుగోపాల్‌రావు



హర్కర వేణుగోపాల్‌రావుకు మొక్క అందిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

నస్పూర్: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కలెక్టరేట్ ఆవరణలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రొటోకాల్, ప్రజా సంబంధాలు)హర్కర వేణుగోపాల్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారని కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. ఉదయం 9:40 గంటలకు మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. 9:45 నిమిషాలకు అక్కడే ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలవేస్తారు. అనంతరం నస్పూర్‌లోని సమీకృత కలెక్టర్ కార్యాలయం సముదాయానికి చేరుకుంటారు. 9:55 గంటలకు పోలీసుల గౌరవందనం స్వీకరిస్తారు. 10 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరిస్తారు.

ప్రభుత్వ సలహాదారుకు స్వాగతం

నస్పూర్: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొనేందుకు సీసీసీ నస్పూర్‌లోని సింగరేణి గెస్టు హౌస్‌కు ఆదివారం సాయంత్రం వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రొటోకాల్, పౌర సంబంధాలు) హర్కర వేణుగోపాల్‌రావుకు కలెక్టర్ కుమార్‌దీపక్ స్వాగతం పలికారు. మొక్క అందజేశారు. డీసీపీ భాస్కర్, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీపీఆర్వో కృష్ణమూర్తి, ఏసీపీ ప్రకాశ్, నస్పూర్ తహసీల్దార్ సంతోష్ ఉన్నారు.

రెండో ఇంక్రిమెంట్ ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న లెక్చరర్స్ అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నూతన అధ్యాపకులుగా చేరిన వారికి రెండో వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ జయప్రదకు లేఖ రాశారు. దానిని కార్యాలయంలో ఆదివారం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను జీవో 16 ప్రకారం క్రమబద్ధీకరించడం జరిగిందని తెలిపారు. 2023, మే 9వ తేదీ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,200 మంది మొదటి వార్షిక ఇంక్రిమెంట్ తీసుకున్నారన్నారు. రెండేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ పూర్తి చేసుకున్నందునబిల్లుతో కలిపి ఇంక్రిమెంట్లు చేయడం లేదని పేర్కొన్నారు. ప్రొబేషనరీ పూర్తి చేసిన వారికి రెండో వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండి ప్రసాద్, నవీన్‌రెడ్డి, డాక్టర్ షఫియొద్దీన్, సందీప్‌కుమార్, సోమయ్య, వెంకటస్వామి, వెంకన్న పాల్గొన్నారు.

ఎస్‌సీఎంఎల్‌యూ కార్యదర్శిగా వీరస్వామి



నియామకపత్రం అందుకుంటున్న వీరస్వామి

బెల్లంపల్లి: సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) కార్యదర్శిగా బెల్లంపల్లికి చెందిన అందె వీరస్వామి నియమితులయ్యారు. ఈమేరకు సంఘం సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ నియామక పత్రం అందజేశారు. కార్మిక సంఘం బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని, కార్మికుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. వీరస్వామి నియామకంపై కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అదరగొడుతున్న క్రికెటర్లు

మంచిర్యాలటౌన్:హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక కోసం నిర్వహిస్తున్న పోటీల్లో క్రీడాకారులు అదరగొట్టారు. మంచిర్యాల పట్టణంలోని ఉషోదయ స్కూల్‌లో ఆదివారం రెడ్, వైట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రెడ్ జట్టు విజయం సాధించింది. రెడ్ జట్టులో వి.సుభాష్ 107 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను పొందగా, పి.రాహుల్ 75 నాటౌట్, సింహాద్రి రెండు వికెట్లు తీశారు. గుడిపేట బెటాలియన్‌లో గ్రీన్, యెల్లో జట్లు తలపడగా గ్రీన్ జట్టు విజయం సాధించింది. యెల్లో జట్టులో జి.చరణ్ 113 పరుగులు చేయగా, గ్రీన్ జట్టు నుంచి మనీశ్ మండల్ 123, అవినాశ్ జాదవ్ 114 పరుగులు చేశారు. ధీరజ్ చంద్ర 3 వికెట్లు తీశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



బోల్తాపడిన ఆటో

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని అడెపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. బాబాసాగర్ గ్రామం నుంచి ట్రాలీ వాహనం కాగజ్‌నగర్ వైపు వెళ్తుండగా, కాగజ్‌నగర్ నుంచి ముంజంపల్లి వైపు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటో బోల్తా పడగా, ట్రాలీ వాహనం రోడ్డు కిందకు పడిపోయింది. ఆటో డ్రైవర్ దుబ్బుల అంజన్న తలకు గాయాలు కాగా, ట్రాలీ డ్రైవర్ దీపక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అంజన్నను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఎస్సై ఇస్లావత్ నరేశ్ ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులు



బ్యాగు అందిస్తున్న రాజశేఖర్, రమణ, గులామ్

ఆదిలాబాద్: ఆర్టీసీ ఉద్యోగులు నిజాయతీ చాటుకున్నారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కు వెళ్లే బస్సులో శనివారం ప్రయాణించిన అక్రమ్ బేగం అందులోనే తన బ్యాగు మర్చిపోయింది. గుర్తించిన కండక్టర్ వి.రమణ, డ్రైవర్ ఎం. గులాబ్ ఆ బ్యాగును డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్‌కు అప్పగించారు. వివరాలు తెలుసుకున్న డిపో అధికారులు సదరు మహిళకు ఆదివారం బ్యాగు అందించారు. అందులో 12 గ్రాముల బంగారం ఒక సెల్‌ఫోన్, రూ. వెయ్యి నగదు ఉన్నట్లు ప్రయాణికురాలు పేర్కొన్నారు. సిబ్బంది, యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గాజులపేటలో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లో గల ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల్‌పేట్‌లో గల తన ఇంటికి అబ్దుల్ కదిరి తాళం వేసి సమీపంలోని సోదరి ఇంట్లోకి వెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళం పగులగొట్టి రూ.7వేల నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చిన అబ్దుల్ కదిరి పగలగొట్టిన తాళాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. సమీపంలోని పెట్రోల్ బంక్‌లో నిలిపి ఉన్న రెండు కొత్త వాహనాల బ్యాటరీలూ చోరీకి గురయ్యాయి.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన 21ఏళ్ల కాంబ్లే సాయిప్రశాంత్ అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ ఇంట్లో ఉంటున్నాడు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రకృతి సోయగం..



చెట్టు కొమ్మల మధ్యన సూర్యుడి ప్రకాశం



గడ్డి తింటున్న చుక్కల దుప్పులు

ప్రకృతిలో ఎన్నో అందాలు దాగిఉన్నాయి. వాటిని చూసినప్పుడు మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది. అలాంటి దృశ్యాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అడవి, మైదానాలు పచ్చదనం సంతరించుకున్నాయి. జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని ఘనిషెట్టి కుంట సమీపంలో చుక్కల దుప్పులు ఇలా లేతగడ్డి తింటూ అటుగా వెళ్లేవారిని ఆకర్షిస్తున్నాయి. వీటిని రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ కెమెరాలో బంధించారు. ఇక జన్నారం మండల కేంద్రంలో వాగుపై వంతెన సమీపంలోని చెట్టు కొమ్మల చాటు నుంచి సాయం సంధ్యాసమయం భానుడు తొంగి చూస్తున్న దృశ్యం ప్రకృతి రమణీయతకు అద్దం పడుతోంది.

– జన్నారం



పచ్చని మైదానంలో మెకాలు..

మత్తు వదలరా..!

- జిల్లాలో యథేచ్ఛగా గంజాయి విక్రయం, వినియోగం
- వాట్సాప్‌లో అమ్మకం, అడ్డాలు, సమయంపై సమాచారం
- నియంత్రణకు ట్రాకింగ్ డాగ్స్ వినియోగం



ఈ ఏడాది ఫిబ్రవరి 20న జిల్లా కేంద్రంలో గంజాయి ముఠా అరెస్టు చూపుతున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో గంజాయి దందాపై పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు చేపడుతున్నప్పటికీ, ఈ చీకటి వ్యాపారం తగ్గడం లేదు. గంజాయి మత్తులో యువత దాడులకు తెగబడటం, బెదిరింపులతో డబ్బులు లాక్కోవడం సమాజంలో ఆందోళన కలిగిస్తోంది. రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బాధ్యతలు చేపట్టిన తర్వాత, జిల్లాను గంజాయి రహితంగా మార్చడంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అయినా క్షేత్రస్థాయిలో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. చిన్న ప్యాకెట్లలో గంజాయి రవాణా, విక్రయాలను గుర్తించడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది.

యువతే లక్ష్యంగా వ్యాపారం..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులను గంజాయి స్మగ్లర్లు టార్గెట్ చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివే యువత నుంచి రోడ్లపై తిరిగే యువకుల వరకు గంజాయికి బానిసలవుతున్నారు. గంజాయి సేవనంతో కలిగే ఆరోగ్య సమస్యలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సామాజిక బాధ్యతగా, మత్తులో ఉన్న యువతను సన్మార్గంలోకి తీసుకొచ్చేందుకు వివిధ చర్యలు చేపడుతున్నారు.

సోషల్ మీడియా వేదిక..

సోషల్ మీడియా, ముఖ్యంగా వాట్సాప్ గంజాయి అమ్మకాలకు అడ్డాగా మారింది. గంజాయి సేవించేవారు వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకుని, కోడ్ భాషలో సమాచారం పంపుతూ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. 100 గ్రాముల ప్యాకెట్లను రూ.200 నుంచి రూ.300కి విక్రయిస్తూ, రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య నిర్దిష్ట ప్రాంతాల్లో డెలివరీ చేస్తున్నారు. శ్రీరాంపూర్ రింగ్ రోడ్, రైల్వే స్టేషన్, కాలేజీ రోడ్, రాజీవ్ నగర్, ఎన్‌టీఆర్ నగర్, జాఫర్ నగర్, అండలమ్మ కాలనీ, తిలక్‌నగర్, బైపాస్ రోడ్ వంటి ప్రాంతాలు గంజాయి అమ్మకాలకు అడ్డాలుగా మారాయి. గతంలో గంజాయి వాడకం మాస్ ఏరియాలకు పరిమితమైనప్పటికీ, ఇప్పుడు క్లాస్ ఏరియాల్లోనూ జోరుగా సాగుతోంది.

సిగరెట్లలో గంజాయి..

పట్టణ కేంద్రాల్లోని పాన్ షాపులు, టీ స్టాల్స్ వద్ద గంజాయిని సిగరెట్లలో దాచి రహస్యంగా విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఓ టీ స్టాల్ గంజాయి సిగరెట్ల విక్రయ కేంద్రంగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. రోజూ వందల మంది యువత ఇక్కడికి వచ్చి, కోడ్ భాషలో గంజాయి సిగరెట్లను కొనుగోలు చేస్తున్నారు.

పెరుగుతున్న బానిసలు..

పోలీసు లెక్కల ప్రకారం, జిల్లాలో గంజాయి వాడకం గణనీయంగా పెరిగింది. గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన గంజాయి వాడకం ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. గంజాయి వ్యసనం యువతను సామాజిక, ఆరోగ్య సమస్యల వైపు నడిపిస్తోంది. పోలీసులు ఈ వ్యసనాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలతో పాటు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ, గంజాయి దందా పూర్తిగా నియంత్రణలోకి రావడం లేదు.

ట్రాకింగ్ డాగ్స్‌తో తనిఖీలు

గంజాయి వాసన పసిగట్టే ట్రాకింగ్ డాగ్స్ సాయంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాత నేరస్తుల ఇళ్లు, పాన్ షాపుల్లో రాత్రిపగలు తేడా లేకుండా తనిఖీలు చేస్తున్నారు. అయినా, కచ్చితమైన సమాచారం లేనప్పుడు గంజాయి విక్రయాలను నియంత్రించడం కష్టంగా మారుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి మే 20 వరకు 30 కేసులు నమోదు కావడం, 95 మంది నిందితులను అరెస్ట్ చేయడం జిల్లాలో దందా ఏరీతిని సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఫిబ్రవరిలో సీసీ కెమెరాల వ్యాపారం ముసుగులో గంజాయి దందా నడిపిన 22 మంది ముఠాను పట్టుకుని, 23.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా, రూ.10.37 లక్షల విలువైన 34 కిలోల గంజాయిని ఈ ఏడాది స్వాధీనం చేసుకున్నారు.

రంగంలోకి ట్రాకింగ్ డాగ్స్..



గంజాయి విక్రయాలు, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. పోలీస్ శాఖ గంజాయి నియంత్రణకు నార్కోటిక్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. స్పెషల్‌గా గంజాయి నియంత్రణకు ప్రత్యేక శిక్షణ తీసుకున్న ట్రాకింగ్ డాగ్స్‌ను వినియోగిస్తున్నాం. జిల్లాకు అధికంగా మహారాష్ట్ర నుంచి వస్తుంది. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పోలీసులకు గంజాయి సమాచారం అందించి నియంత్రణకు కృషి చేయాలి. యువతను పేడదోవ పట్టకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ మంచిర్యాల

వర్షాకాలం.. పశువులు పైలం



డా.ఓంప్రకాశ్, పశువైద్యాధికారి



సతీశ్, పశువైద్యాధికారి, కత్తెరసాల

చెన్నూర్‌రూరల్/లక్ష్మణచాంద: వర్షాకాలం ఆరంభమైంది. ఈసారి ముందస్తుగానే వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వ్యవసాయ పనులు కూడా మొదలయ్యాయి. మరోవైపు అకాల వర్షాలకు నేల కూడా పచ్చబడింది. లేదగడ్డి పశువులను ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో, పశువులకు అంటు వ్యాధులు త్వరగా సోకే అవకాశం ఉందని కత్తెరసాల, లక్ష్మణచాంద పశు వైద్యాధికారి సతీశ్, ఓంప్రకాశ్ సూచించారు. పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు సంబంధించిన సాధారణ వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ, చికిత్స విధానాలు వెల్లడించారు.

గాలిపుండు (పుట్‌రాట్)

వ్యాధి లక్షణాలు: వర్షాకాలంలో చిత్తడి నేలలపై తిరిగే మేకలు, గొర్రెలకు గాలిపుండు వ్యాధి సోకే అవకాశం ఎక్కువ. ఈ బ్యాక్టీరియల్ వ్యాధి వల్ల గొర్రెలు కుంటుతూ, మూడు కాళ్లపై గెంటుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిపోయి, చీము పట్టి నల్లగా మారుతుంది. తీవ్రమైతే గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంది.

నివారణ చర్యలు

వ్యాధి సోకిన పశువులను వెంటనే గుర్తించి, ఆరోగ్యవంతమైన వాటికి దూరంగా ఉంచాలి.

చిత్తడి నేలలు, నీరు నిలిచే ప్రాంతాల నుంచి పశువులను దూరంగా ఉంచాలి. వర్షం నుంచి రక్షణ కల్పించే ఆరు ప్రాంతాల్లో పశువులను ఉంచాలి.

చికిత్స తర్వాత నయమైన పశువులను మాత్రమే ఆరోగ్యవంతమైన వాటితో కలపాలి.

చికిత్స విధానం

వైద్యుని సలహాతో పెన్సిలిన్, నొప్పి నివారణ మందులు వాడాలి. వ్యాధి సోకిన గిట్టలను 10% ఫార్మలిన్ లేదా కాపర్‌సల్ఫేట్ ద్రావణంలో ముంచాలి.

నీలి నాలుక వ్యాధి (బ్లూ టంగ్ డిసీజ్)

వ్యాధి లక్షణాలు: నీలి నాలుక వ్యాధి, వైరస్ వల్ల సంక్రమించే ఈ వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుంది. వర్షాకాలంలో ఈవ్యాధి విస్తరణ అవకాశం ఎక్కువ.



మేతకు వెళ్తున్న గొర్రెలు

లక్షణాలు: అధిక జ్వరం, చొంగ కారడం, పెదవులు, చిగుళ్లు వాచడం, ఎర్రటి గుల్లలు ఏర్పడడం.

తీవ్ర సందర్భాల్లో గిట్టలు వాచి, నాలుక నీలం రంగులోకి మారుతుంది.

పశువులు నడవలేక, మేత మేయక, అచేతన స్థితికి చేరి కిందపడిపోతాయి.

నివారణ చర్యలు: ఈగలు, దోమల నివారణకు రోజుకు రెండుసార్లు వేప ఆకులతో పొగ వేయాలి. బురద, నీరు నిలిచే ప్రాంతాలను శుభ్రం చేయాలి.

చికిత్స విధానం

పశువైద్యుడిని సంప్రదించి, యాంటీబయోటిక్, నొప్పి నివారణ మందులు వాడాలి.

నోటి పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి, జింక్ పౌడర్ రాయాలి.

గిట్టల పుండ్లకు హిమాక్స్, లేమనెంట్ వంటి ఆయింట్‌మెంట్‌లు వాడాలి.

చిటుకు వ్యాధి..

తొలకరి గడ్డిలో క్లాస్ట్రీడియం ఫర్ ఫ్రింజర్స్ టైప్-డి అనే రకం సూక్ష్మజీవులు ఉంటాయి.ఈ సూక్ష్మ జీవులు గాలి లేని వాతావరణంలో ఎక్కువగా వృద్ధి చెందుతాయి. తొలకరి పిచ్చి గడ్డిని జీవాలు తిన్నప్పుడు జీవాల పేగుల్లో గాలి లేని వాతావరణం ఏర్పడి అక్కడ సూక్ష్మజీవుల వల్ల ఏర్పడిన విష పదార్థాల వల్ల ఈ చిటుకు వ్యాధి వస్తుంది.

వ్యాధి లక్షణాలు:

వ్యాధి సోకిన గొర్రెలు కొన్నిసార్లు ఎటువంటి లక్షణాలు లేకుండానే ఆకస్మికంగా మరణిస్తాయి. కొన్ని ఎగిరి కిందపడి కాళ్లు కిందకు కొట్టుకుంటూ, పళ్లు కొరుకుతూ చనిపోతాయి. వ్యాధి సోకిన గొర్రెలు చొంగ కారుస్తాయి. శ్వాస అధికంగా ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

చికిత్స కంటే నివారణ ముఖ్యం. మే నుంచి జూలై వరకు వ్యాధినిరోధక టీకా(మల్టీ కాంపోనెంట్ ఈటీ వ్యాక్సిన్) వేయించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో పశు వైద్యాధికారికి తెలియ చేసి చికిత్స చేయించాలి. తొలకరి చినుకులకు మొలిచిన గడ్డి మేయకుండా చూసుకోవాలి. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి.

లెదర్ పార్క్ జేఏసీ ఏర్పాటు



జేఏసీ కమిటీ సభ్యులు

మందమర్రిరూరల్:లెదర్ పార్క్ సాధన సమితి ఆధ్వర్యంలో మందమర్రి, మంచిర్యాల లెదర్ ఇండస్ట్రీయల్ పార్క్ జేఏసీ కమిటీలను మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో ఆదివారం ఎన్నుకున్నారు. మందమర్రి పట్టణ జేఏసీ కన్వీనర్‌గా నెరువెట్ల శ్రీనివాస్, కోకన్వీనర్‌గా మంతె సుమన్, ముల్కల్ల రమేశ్, రామకృష్ణ, నందిపేట రాజు, నెరువెట్ల సుజిత్, గడ్డం అనిల్, కొలుగూరి పృథ్వీరాజ్, బత్తుల సరిత, బొడ్డు వినోద, సకినాల సాయికృష్ణ, ఎంవీ.గుణ, కాసిపేట స్వామి, తోకల నిరోష, గౌరవాధ్యక్షులుగా ఉప్పులేటి నరేశ్ ఎన్నికయ్యారు. మంచిర్యాల జిల్లా గౌరవ అధక్షులుగా పుల్లూరి లక్ష్మణ్, కన్వీనర్‌గా చిప్పకుర్తి ఐలయ్య, కోకన్వీనర్లుగా జంగంపల్లి రామస్వామి, పల్లె సమ్మయ్య, నందిపేట రవి, దరిపెల్లి కనుకయ్య, సిద్ర దివాకర్, నేరెల్ల శంకరయ్య, ఎలుకలపల్లి మల్లేశ్, సుద్దాల జనార్దన్, ఆసంపల్లి రాయమల్లు, బచ్చలి నరసయ్య, వేల్పుల కిరణ్, చిలుముల కుమార్, మామిడిపల్లి ప్రకాశ్, కొంకటి శ్రీనివాస్, కాసిపేట స్వామి ఎన్నికయ్యారు.

సత్యపాల్‌రావుకే ఐఎన్‌టీయూసీ మద్దతు

కాసిపేట:కాసిపేట మండలం దేవాపూర్ సిమెంట్ కంపెనీలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో సత్యపాల్‌రావుకే ఐఎన్‌టీయూసీ మద్దతు ప్రకటించింది. ఈమేరకు రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలిపారు. ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ మొదటి నుంచి ఐఎన్‌టీయూసీకి అనుబంధంగా ఉందని పేర్కొన్నారు. సత్యపాల్‌రావు తండ్రి రఘుపతిరావు ఐఎన్‌టీయూసీ మద్దతుతో ఇదే పలుమార్లు పోటీచేసి గెలిచారని గుర్తు చేశారు. ప్రస్తుతం కొందరు ఎమ్మెల్యేలు మద్దతు తెలుపుతున్న యూనియన్, అభ్యర్థికి ఐఎన్‌టీయూసీతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఐఎన్‌టీయూసీ కార్మికులకు అండగా ఉంటుందని తెలిపారు. సత్యపాల్‌రావును గెలిపించాలని కోరారు.

దేవాపూర్‌లో మోటర్ సైకిల్ ర్యాలీ

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో సత్యపాల్ రావుకు మద్దతుగా నాయకులు, కార్మికులు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ గ్రామ పటేళ్లు, ఆదివాసీ సంఘాల నాయకులు, తెలంగాణ ఓరియంట్ స్టాఫ్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మిక నాయకులు రమణారెడ్డి మద్దతు తెలిపి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

శాస్త్రీయ పద్ధతిలో సర్దుబాటు చేయాలి

- టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లచ్చిరాం

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటును శాస్త్రీయ పద్ధతిలో చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లచ్చిరాం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 మంది విద్యార్థులకు ఇద్దరే ఎస్జీటీలను నియమించడం సరికాదన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20కి తగ్గించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. బడిబాట సాగుతున్న సమయంలో సర్దుబాటు చేయడం సరికాదని తెలిపారు. ఇటీవల ఉద్యోగ విరమణతో చాలా పోస్టులు ఖాళీ అయ్యాయని తెలిపారు. విద్యా సంవత్సరానికి ముందే పదోన్నతులు కల్పిస్తే ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన భూపతిరెడ్డి, కిరణ్ బాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి, సంఘ బాధ్యులు ఆర్.సుజాత, గంగ్రత్ నారాయణ, రామారావు, రమేశ్, దేవన్న, ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో సోమయ్య, శ్రీహరి, రమేష్, పండరీనాథ్, ప్రపుల్‌చందర్, ఉపాధ్యాయులు యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆవుదూడను చంపిన కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి



నిందితుడు ఉపయోగించిన కత్తి

ఆదిలాబాద్‌టౌన్: ఆవుదూడను చంపిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భోరజ్ మండలం సిర్సన్న గ్రామానికి చెందిన సాయికుమార్‌కు చెందిన ఆవుదూడను అదే గ్రామానికి చెందిన రాథోడ్ సంజయ్ గిమ్మ శివారులో కత్తితో పొడిచాడు. జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై గౌతమ్ అక్కడికి చేరుకోగా కొద్ది సేపటికే ఆవుదూడ మృతిచెందింది. పోలీసులు సంజయ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు వివరించారు. ఆవుదూడను చంపి అటవీ జంతువుల మాంసంగా అమ్మేందుకు ప్రయత్నం చేసినట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో మేకల దొంగతనం, గుడిలో దొంగతనం, ఫారెస్ట్ కేసులు నమోదై ఉన్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఆవులను అక్రమంగా తరలించినా, చంపినా చట్టరీత్యా నేరమని అన్నారు. ఇలాంటి వారిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖానాపూర్: పట్టణంలోని ఖానాపూర్–తర్లపాడ్ వెళ్లే మార్గంలో మదీనా మసీద్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన షెట్టి హిమబిందు–చంద్రశేఖర్ దంపతులు తర్లపాడ్ గ్రామంలోని ఆలయానికి వెళ్లి ఖానాపూర్‌కు తిరిగి వస్తుండగా ఖానాపూర్ నుంచి తర్లపాడ్ వైపు వెళ్తున్న లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హిమబిందు చేయి నుజ్జునుజ్జు కావడంతో పాటు చంద్రశేఖర్ తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌కు రిఫర్ చేశారు. లారీ డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం చోటు చేసుకుందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉత్తమ ‘సేవా’ పతకాలు

- ఉమ్మడి జిల్లాలో పలువురు పోలీసులు ఎంపిక

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి పోలీసు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి రవి గుప్తా ఆదివారం పతకాలను ప్రకటించారు. తెలంగాణ శౌర్య పతకం కింద రూ.10వేల నగదు, తెలంగాణ మహోన్నత సేవా పతకం కింద రూ.40వేలు, తెలంగాణ ఉత్తమ సేవా పతకం కింద రూ.30వేలు, తెలంగాణ కఠిన సేవా పతకం కింద రూ.20వేలు, తెలంగాణ సేవా పతకం కింద రూ.20వేల నగదు అందజేసి సత్కరించనున్నారు. ఉమ్మడి జిల్లాలో పలువురు మహోన్నత, ఉత్తమ సేవా, సేవా పతకాలకు ఎంపికయ్యారు.

ఇంటెలిజెన్స్..

- ఎస్.లింగారెడ్డి, ఏఎస్సై, ఆదిలాబాద్ జోన్
- పి.శ్రీధర్, హెచ్‌సీ, ఆదిలాబాద్ జోన్

మహోన్నత సేవా పతకం : రామకృష్ణ, ఆర్‌ఐ, 2వ బెటాలియన్ యాపల్‌గూడ

ఉత్తమ సేవా పతకం : కె.నర్సయ్య, ఎస్సై, పీసీఆర్, ఆదిలాబాద్

ఎండీ తాహెర్‌ఖాన్, హెడ్‌కానిస్టేబుల్, సోన్, నిర్మల్

జిల్లాల వారీగా సేవా పతకాలకు ఎంపికైన వారు..

ఆదిలాబాద్.

- విష్ణుప్రకాశ్, ఎస్సై, టూటౌన్
- బి.రవీందర్ రెడ్డి, హెచ్‌సీ, గుడిహత్నూర్
- ఎ.నాగేశ్వర్, పీసీ, గాదిగూడ
- కె.కిషన్, ఏఆర్ పీసీ, ఆదిలాబాద్
- ఎ.రాములు, ఏఆర్ కానిస్టేబుల్, ఆదిలాబాద్
- సీహెచ్ గోపాల్, కానిస్టేబుల్, గాదిగూడ
- డి.రమేశ్, హెచ్‌సీ, టీజీఎస్‌పీ 2వ బెటాలియన్
- జి.నర్సయ్య, హెచ్‌సీ ఈజీఎస్‌పీ, 2వ బెటాలియన్

కుమురంభీం ఆసిఫాబాద్.

- రాజేందర్ ప్రసాద్, సీఐ, కాగజ్‌నగర్
- శ్రీనివాస్, ఎస్సై, ఆసిఫాబాద్
- తిరుమల, డబ్ల్యూ ఎస్సై, భరోసా సెంటర్, ఆసిఫాబాద్
- బాలాజీ, ఏఎస్సై, కాగజ్‌నగర్
- బీహెచ్ శ్రీనివాస్, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్, ఆసిఫాబాద్
- ఎండీ అజీమొద్దీన్, హెచ్‌సీ, సిర్పూర్(టి)
- షేక్ ఇమామ్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్
- విశ్వజీత్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఆసిఫాబాద్

నిర్మల్..

- ఎండీ సిద్ధిఖీ హుస్సేన్, ఎస్సై, నిర్మల్
- ఎం. హనుమాండ్లు, ఏఎస్సై, నిర్మల్
- మారుతి, ఏఎస్సై, భైంసా రూరల్ పీఎస్
- అబ్దుల్ నయీమ్, ఏఆర్ ఎస్సై, దార్, నిర్మల్
- రాథోడ్ భీంరావు, ఏఎస్సై, దిలావర్‌పూర్
- రామారావు హెచ్‌సీ, డీఎస్బీ, నిర్మల్
- గంగారెడ్డి, హెచ్‌సీ, దిలావర్‌పూర్
- పెద్ద రాజన్న, హెచ్‌సీ, భైంసా
- చిన్నయ్య, హెచ్‌సీ, డీఎస్బీ, నిర్మల్
- డి.సుదర్శన్, పీసీ, తానూర్
- సూర్యవెంకటి, పీసీ, లక్ష్మణచాంద
- మాణిక్‌రావు, పీసీ, ముథోల్
- శివకుమార్, పీసీ, సోన్

మంచిర్యాల..

- డి.సురేందర్, ఏఆర్ ఎస్సై, గుడిపేట, మంచిర్యాల 13వ బెటాలియన్